క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు

పమిడిముక్కల: పెనుమత్స దళితవాడలోని అంగన్ వాడీ కేంద్రంలో సమస్యలతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అంగనవాడీ కార్యకర్త నిర్మలజ్యోతి ఈ సమస్యను పెనుమత్స గ్రామ సర్వీస్ ట్రస్ట్‌కు తెలియజేశారు. వెంటనే స్పందించిన సర్వీస్ ట్రస్ట్ రూ.40 వేలు ఖర్చుచేసి అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేపట్టి రంగులు వేయించారు. సర్వీస్ ట్రస్ట్ నిర్వాహకులకు చిన్నారుల తల్లిదండ్రులు, దళితవాడ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

అంకమ్మతల్లికి శ్రావణ పూజలు



తోట్లవల్లూరు: గరికపర్రులోని వీరంకి వారి అంకమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రావణమాసం పురస్కరించుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వీరంకి వంశీకులు అంకమ్మతల్లిని దర్శించుకుని పూలు, పండ్లు, నైవేద్యంతో పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పామర్రు(మొవ్వ): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పామర్రు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. పామర్రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఎస్ఐ అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సూచనలిచ్చారు. రౌడీ షీటర్లందరూ నేర ప్రవృత్తిని మానుకొని, క్రమశిక్షణతో జీవించాలన్నారు. గంజాయి, జూదం, కొట్లాటలకు దూరంగా ఉండాలన్నారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో అమ్మవారి దర్శనానికి భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకునేందుకు బారులు తీరారు. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

బొడ్డురాయి తొలగింపు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి అగ్రహారంలో ఆదివారం శీతల యంత్రం (బొడ్డు రాయి) శిథిలావస్థకు చేరుకోవటంతో కూచిపూడి పెద్దలు, యువకులు దాన్ని ఆదివారం తొలగించి పునః ప్రతిష్టకు సన్నాహాలు చేశారు. వేద పండితులు నిర్ణయించిన శుభ ముహూర్తం ఆగస్టు 11న ఉదయం 11.10 గంటలకు పునః ప్రతిష్ట నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం శీతల యంత్రం (గంగానమ్మదేవత)కు చద్ది నైవేద్యం పెట్టి, దానిని తొలగింపు చర్యలు చేపట్టారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

మండవల్లి: మానవత మండవల్లి శాఖ అధ్యక్షుడు గుడివాడ గణేష్ ఆధ్వర్యంలో పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మానవత మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సీ వాడకు చెందిన తల్లిదండ్రులు లేని పేద విద్యార్థికి పుస్తకాలు, బ్యాగు, కళాశాల ఫీజు నిమిత్తం రూ. 6,200 అందించారు. అలాగే పేద మహిళ గుడివాడ లక్ష్మికి నెలవారీ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రొఫెసర్ సూదాబత్తుల విజయ్‌కుమార్, ముల్లపూడి సత్తిబాబు, బొల్లెంపల్లి కృష్ణారావు, ఎలికే రాంబాబు, ఏసుబాబు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

గుడివాడ టౌన్: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జి. రామస్వామి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో పెన్షనర్ల సంఘం గుడివాడ శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డీఆర్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ గత విధానాన్ని కొనసాగించాలని, సీనియర్ సిటిజన్‌లకు రైలు, విమాన ప్రయాణాల్లో మినహాయింపు ఇవ్వాలన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.వరప్రసాదు, ట్రెజరీ అధికారి జ్యోతేశ్వరరావు, గుడివాడ అధ్యక్షుడు బి.శంకర్‌నాథ్, కార్యదర్శి వీవీ మురళీకృష్ణ, కోశాధికారి కె. రామకృష్ణ పాల్గొన్నారు.

గంగానమ్మకు సారె సమర్పణ

మండవల్లి: గ్రామదేవత శ్రీ గంగానమ్మ వారికి శ్రావణమాసం సందర్భంగా ఆదివారం భక్తులు సారె సమర్పించారు. అచ్యుత సోదరుల ఆధ్వర్యంలో వందలాదిమంది భక్తులు మేళతాళాలతో పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, పండ్లు, గాజులు, స్వీట్లతో అమ్మవారికి సారె సమర్పించారు.

రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

మండవల్లి: రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఐక్య వేదిక సభ్యులపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు అన్నారు. స్థానిక స్టేషన్‌రోడ్‌లోని ఇన్‌స్టిట్యూట్‌లో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జూలైలో జరిగిన గ్రామసభల నిర్వహణ, సమాచారహక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాల్సిన బాధ్యత ఐక్యవేదిక సభ్యులపై ఉందన్నారు.



కపిలేశ్వరపురం గ్రామంలో రోడ్డు దుస్థితి



అధ్వానంగా కపిలేశ్వరపురం-ముత్రాసిపాలెం రోడ్డు



గుంతలమయంగా బార్లపూడి డొంక రోడ్డు

చినుకుపడితే చిత్తడే.. ఆదమరిస్తే ప్రమాదమే!

● మామిళ్లపల్లి, కపిలేశ్వరపురం శివారు గ్రామాల్లో రోడ్ల దుస్థితి ● నడిచివెళ్లేందుకు కూడా కష్టమే

పమిడిముక్కల: మండలంలోని మామిళ్లపల్లి, కపిలేశ్వరపురం శివారు గ్రామాల రోడ్లు చినుకుపడితే చిత్తడిగా మారుతున్నాయి. రోడ్లు బురదమయంగా మారడంతో వాహన రాకపోకలు సాగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ద్విచక్రవాహనచోదకులు ఆదమరచి డ్రైవింగ్ చేస్తే ఆస్పత్రి పాలవుతున్నారు.

అధ్వానంగా మామిళ్లపల్లి-గంద్రపువానిగూడెం రోడ్డు

మామిళ్లపల్లి గ్రామం నుంచి పోతురాజుమాలపల్లి, గంద్రపువానిగూడెం వెళ్లె రోడ్డు అధ్వానంగా మారింది. రెండు కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డంతా గుంతలమయంగా మారింది. వర్షం పడితే గుంతల్లో నీరుచేరి రోడ్డు కనబడని పరిస్థితి నెలకొంది. రెండు పల్లెల్లోని ప్రజలు ప్రతి పనికీ మామిళ్లపల్లి రావాల్సి ఉంది. గ్రామం నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక సెలవులు పెడుతున్నారు. రైతులు పొలాలకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. మామిళ్లపల్లి గ్రామం బార్లపూడి డొంకరోడ్డు వరకు విస్తరించి ఉంది. డొంక రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో నీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. పోతురాజుమాలపల్లి, గంద్రపువానిగూడెం, డొంకరోడ్డులో నివసిస్తున్నవారు కూచిపూడికి ఈ రహదారిపై నుంచే వెళ్లాల్సి ఉంది.



బురదమయంగా మారిన మామిళ్లపల్లి-గద్రపువానిగూడెం రోడ్డు

దుస్థితిలో కపిలేశ్వరపురం-ముత్రాసిపాలెం రోడ్డు

కపిలేశ్వరపురం శివారు ముత్రాసిపాలెం వెళ్లె రోడ్డు గుంతలమయంగా మారింది. మూడు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డంతా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బురదమయంగా ఉంది. గ్రామస్తులు పనుల నిమిత్తం కపిలేశ్వరపురం, ఉయ్యూరు వెళ్లాల్సి ఉంది. బురదమయంగా మారిన రోడ్డుపై రాకపోకలు సాగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు అదుపుతప్పి పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామంలోకి బస్సులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో వివిధ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మంటాడ, తాడంకి, కపిలేశ్వరపురం గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. కపిలేశ్వరపురం గ్రామం మధ్యలోని ప్రధాన రహదారి పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

ఎన్నో ఏళ్లుగా అడుగుతున్నా పట్టించుకోలేదు



మామిళ్లపల్లి-గంద్రపువానిగూడెం రోడ్డును బాగుచేయాలని ఎన్నో ఏళ్లుగా అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. గ్రామంలోకి ఆటో వచ్చే పరిస్థితి లేదు. మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలప్పుడు రోడ్డు వేస్తామని హామీ ఇస్తున్నారు. తరువాత మరచిపోతున్నారు.

–గంద్రపు చింతయ్య, పోతురాజుమాలపల్లి, మామిళ్లపల్లి

బార్లపూడి డొంక రోడ్డును అభివృద్ధి చేయాలి



బార్లపూడి డొంక రోడ్డంతా గుంతలమయంగా మారింది. గుంతల్లో నీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. నడిచి వెళ్లడం కష్టంగానే ఉంది. కూచిపూడి వెళ్లేందుకు ఇదే రహదారి. రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి, అభివృద్ధి చేయాలి.

– రవికిరణ్, గంద్రపువానిగూడెం, మామిళ్లపల్లి

రాకపోకలు సాగక ఇబ్బందులు



మూడు కిలోమీటర్ల ఉన్న ముద్రాసిపాలెం రోడ్డంతా అధ్వానంగా ఉంది. రాకపోకలు సాగక ఇబ్బందులు పడుతున్నాం. ఈ రోడ్డు మాతో పాటు మంటాడ, కపిలేశ్వరపురం, తాడంకి గ్రామాల రైతులకు ఎంతో ఉపయోగకరం. కొన్నేళ్లుగా అధికారులను, ప్రజాప్రతినిధులను అడుగుతున్నా ప్రయోజనం లేదు. రోడ్డుకు మోక్షం కల్పించాలి.

– తుమ్మా లక్ష్మణరావు, ముత్రాసిపాలెం, కపిలేశ్వరపురం

అగాధంలా గ్రామంలో ప్రధాన రహదారి



కపిలేశ్వరపురం గ్రామం మధ్యలో ఉన్న రోడ్డు గుంతలు పడి అగాధంలా మారింది. గుంతల్లో నీరు చేరి రోజులతరబడి అలాగే నిలిచి ఉంటోంది. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగునీరు పోయే ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలను వెంటనే పూడ్చాలి.

– కొణతం శివరామకృష్ణ, కపిలేశ్వరపురం

అమ్మవారికి లక్ష కుంకుమార్చన



పామర్రులో అమ్మవారికి కుంకుమార్చన



గుడివాడలో స్వామికి లక్ష తులసి అర్చన

పామర్రు(మొవ్వ): పామర్రులోని సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీమత్ పార్వతి అమ్మవారికి ఆదివారం గీత పారాయణ భక్త బృందం, బ్రాహ్మణ మహిళా మండలి సభ్యులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వేద విద్వాన్ బేతాన బొట్ల ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు సోమేశ్వర శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా లక్ష తులసి అర్చన

గుడివాడ టౌన్: స్థానిక పామర్రు రోడ్డులో వేంచేసియున్న శ్రీరామ సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో లక్ష తులసి అర్చన ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు కె. శ్రీనివాస్-శ్రీలక్ష్మి దంపతులు స్వామి వారి అర్చనలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు రామకృష్ణమాచార్యులు, ట్రస్టీ జి.లక్ష్మీ రంగనాయకమ్మ, సాయికుమార్, ఎన్. రమేష్, మాదాసు పృథ్వీతేజ, మాదాసు వెంకట లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రేట్లకు ఎరువులను అందించాలి

చినముత్తేవి(మొవ్వ): జిల్లాలో అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం రైతులకు ఎరువులను సబ్సిడీ రేట్లకు అందించాలని రైతు సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు కోసూరు శివ నాగేంద్రం కోరారు. మొవ్వ మండలం చినముత్తేవిలో రావూరి అజయ్ భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాట్లు వేసిన రైతులకు యూరియా అందుబాటులో లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. షాపుల యాజమాన్యం కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్నారు. కాంప్లెక్స్, గుళికలు కొంటే గాని యూరియా ఇస్తామని నిబంధనలు పెడుతున్నారని తెలిపారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్న షాపులపై విజిలెన్స్, వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించి బ్లాక్ మార్కెట్ అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, మొవ్వ మండల నాయకులు కొడాలి కరుణాకర్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివ నాగేంద్రం

పీహెచ్‌సీ వద్ద మురుగునీటితో ఇబ్బందులు

మండవల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వద్ద మురుగునీటితో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలో ఉన్న 29 గ్రామాల ప్రజలు ఆరోగ్య పరీక్షల కోసం ఈ పీహెచ్‌సీకు నిత్యం వస్తూ ఉంటారు. అపరిశుభ్ర వాతావరణంతో వారి ఆరోగ్య సమస్యలు ఎలా ఉన్నా కొత్తగా సమస్యలు చుట్టుముట్టే అవకాశముందని ప్రజలు వాపోతున్నారు. పీహెచ్‌సీ ప్రాంగణం పల్లపు ప్రదేశంలో ఉండటంతో వర్షం నీరు నిలుస్తోంది. పీహెచ్‌సీ కాంపౌండ్ వాల్ పక్కన ఉన్న డ్రెయిన్‌లో మురుగునీరు నిల్వ ఉన్న కారణంగా రోగులకు ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు పీహెచ్‌సీ వద్ద ఉన్న మురుగునీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఘనంగా అంకమ్మతల్లి సంబరం



ముదినేపల్లి రూరల్: మండలంలోని శ్రీహరిపురంలో అంకమ్మతల్లి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరసా వారి ఇలవేల్పు అంకమ్మతల్లి సంబరం ప్రతి ఏటా శ్రావణమాసంలో మొదటి ఆదివారం నిర్వహిస్తారు. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో తొలుత పోతురాజు గెడకు భక్తులు పూజలు చేసి అమ్మవారిని విశేషంగా అలంకరించి స్వీట్లు, పండ్లు సమర్పించారు. అనంతరం డప్పు వాయిద్యాలతో అధిక సంఖ్యలో మహిళలు, యువకులు గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి మొక్కులు సమర్పించారు.

సంక్షిప్త వార్తలు

ఉత్తమ సేవలకు గుర్తింపు



గుడివాడ టౌన్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్య ఉద్యోగి శుభావతి సేవలను గుర్తించి ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో ఎన్జీఓస్ అసోసియేషన్ గుడివాడ తాలూకా యూనిట్, ఫ్రెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ సత్కారం జరిగింది. ఆస్పత్రి నర్సుగా ఉత్తమ సేవలందించినందుకు గాను ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు పొందిన సందర్భంగా ఈ సత్కారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీఓస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ ఫరీద్ బాషా, జి. రాజేంద్ర ప్రసాద్, ఎఫ్‌పీఎఫ్ కన్వీనర్ డీఆర్‌బీ ప్రసాద్, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి బి. శంకర్‌నాథ్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



కైకలూరు: భారతదేశ ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన మాజీ రాష్ట్రపతి, అంతరిక్ష శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అడుగుజాడల్లో పయనించాలని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. కలాం వర్ధంతి సందర్భంగా కైకలూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కైకలూరు మండల పార్టీ అధ్యక్షుడు సింగంశెట్టి రాము, రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీ మహమ్మద్ గాలిబ్‌బాబు, ఏలూరు జిల్లా యూత్ వింగ్ కమిటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ మాలిక్, నాయకులు సమయం రామాంజనేయులు, ఉంద్రమట్ల ఏసుకుమార్, పంజా నాగు, బుర్ల కిరణ్, ఫిర్దోజ్ ఖాన్ పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు

ముదినేపల్లి రూరల్: యువతిపై యువకుడి అసభ్య ప్రవర్తనకు సంబంధించి స్థానిక పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. మండలంలోని ములకలపల్లికి చెందిన ఓ యువతి స్నానం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన పి.ప్రకాశం బాత్రూమ్ సమీపంలో తాచ్చాడుతూ ఉండగా యువతి గమనించి బయటకు వచ్చేలోపు ప్రకాశం పారిపోయినట్లు తెలిపారు. దీనిపై యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సుబ్బారాయుడి ఆలయంలో భక్తుల రద్దీ

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి పర్యవేక్షించారు.

సరిహద్దు వివాదంపై దాడికి యత్నం

ముదినేపల్లి రూరల్: చేపలచెరువు సరిహద్దు వివాదంలో వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడికి యత్నించిన ఘటన మండలంలోని పెదగొన్నూరులో చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన శ్రవణం పూర్ణచంద్రరావు చేపలచెరువుగట్టు బాగు చేస్తుండగా సరిహద్దుదారులైన సురేష్, శివరామకృష్ణ, నాగేశ్వరరావు గొడవకు దిగినట్లు తెలిపారు. అనంతరం పూర్ణచంద్రరావు కారులో వెళుతుండగా కత్తిని కారుపైకి విసిరి దాడికి యత్నించడంతో పాటు అసభ్యపదజాలంతో దూషించినట్లు పూర్ణచంద్రరావు పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: 33/11 కేవీ వరహపట్నం సబ్‌స్టేషన్‌లో 11కేవీ సోమేశ్వరం, రామవరం ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలుపుదల చేస్తున్నామని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సీతనపల్లి, దొడ్డిపట్ల, రామవరం, సోమేశ్వరం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫొటో, వీడియో గ్రాఫర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

కైకలూరు: నియోజకవర్గ ఫొటో-వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక కైకలూరు ట్రావెల్స్ బంగ్లాలో ఆదివారం నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షులుగా కసగాల శ్యాం సువర్ణరావు, నరహరిశెట్టి శ్యామ్‌బాబు, సంఘ అధ్యక్షుడిగా దుర్గం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చాబెత్తిన ప్రేమ్ కిరణ్, కార్యదర్శిగా కొచ్చెర సుకుమార్, ఉప కార్యదర్శిగా వాసుపల్లి సతీష్ కన్నా, కోశాధికారిగా ఘంటసాల రామకృష్ణ తదితరులను ఎన్నుకున్నారు.

ఉచిత వైద్యశిబిరం

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వెరికోసిస్ వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని జీవీ పూర్ణచంద్రరావు ఫంక్షన్ హాల్లో ఈ వైద్యశిబిరం ఆదివారం జరిగింది. సుమారు 80 మందికి పరీక్షలు నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రముఖ వెరికోసిస్ నిపుణురాలు డాక్టర్ లావణ్య ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెరికోసిస్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే దాని ప్రభావం అధికమవుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు, కార్యదర్శి కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షులు టిఎస్ రాజశేఖర్, ఎ. సుబ్రహ్మణ్యేశ్వరరావు, కెబిజి తిలక్, కె. వెంకటేశ్వరరావు, ఎస్. ఉదయ్ భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటోస్టాండ్ బోర్డు పునర్నిర్మాణం



గుడివాడ టౌన్: రూరల్ మండలంలోని పలు ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేసేందుకు పోలీస్ అంగీకారంతో ఏర్పాటు చేసిన ఆటోస్టాండ్ బోర్డును ఆదివారం పునర్నిర్మించారు. స్థానిక బంటుమిల్లి రోడ్ నుంచి దొండపాడు, మోటూరు, చౌటపల్లి, ముదినేపల్లి వైపు గ్రామాలకు వెళ్లే ఆటోలు ఇక్కడి నుంచి బయలు దేరతాయి. సమీప షాపు యజమానులు దీనిని కూల్చి వేయడంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. వారి సౌకర్యార్థం సీఐటీయూ ఆధ్వర్యంలో తిరిగి అదే ప్రాంతంలో ఆటో స్టాండ్ బోర్డు నిర్మించినట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి తెలిపారు.

చర్మకారులకు రుణాలు ఇప్పించాలి



గుడ్లవల్లేరు: చర్మకారులకు రుణాలను ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ చర్మ కార సేవా సంఘం అధ్యక్షుడు బుల్లా రాజారావు ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మకు శనివారం వినతిపత్రాన్ని అందించినట్లు ఆ సేవా సంఘ జిల్లా అధ్యక్షుడు ఉడుముల నరేష్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లా త్యాగరాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. జిల్లాలోని చర్మకారులు, డప్పు కళాకారులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల రుణం మంజూరు చేయాలని కోరామని పేర్కొన్నారు.

పేదలకు డాక్టర్ బాబు సేవలు ఎనలేనివి



గుడ్లవల్లేరు: పేదలకు ఇంటింటికీ అన్నదాన క్యారేజీలను అందించి, సేవ చేయటంలో గుడివాడ ఏఎంసీ మాజీ చైర్మన్ దివంగత కొసరాజు వెంకటాద్రి చౌదరి(డాక్టర్ బాబు) సేవలు ఎనలేనివని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు కొనియాడారు. డాక్టర్ బాబు జయంతి వేడుకలను ఆదివారం గుడ్లవల్లేరులో కూచికాయలపూడి మాజీ సర్పంచి, కొసరాజు సేవా సమితి అధినేత కొడాలి రామరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బాబు విగ్రహానికి వల్లభనేనితో పాటు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాపయ్యచౌదరి పూలమాల వేసి నివాళులర్పించారు.

శాంతించిన కృష్ణమ్మ

తోట్లవల్లూరు: కృష్ణానదిలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఎడతెరపి లేని వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటిని విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి అధికారులు దిగువకు విడుదల చేస్తున్న విషయం విదితమే. గత మూడు రోజుల పాటు లంకగ్రామాల ప్రజలను, రైతులను ఉత్కంఠకు గురి చేసిన కృష్ణానదిలో వరద క్రమంగా తగ్గుముఖం పడుతోంది. దీంతో రైతులు, లంక గ్రామాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నట్లయ్యింది. నదిలో తాత్కాలిక బాటలు కోతకు గురై దెబ్బతినటంతో పడవలపైనే లంక గ్రామాల ప్రజల, రైతులు, కూలీలు రాకపోకలు సాగిస్తున్నారు.

ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి

గుడివాడ టౌన్: ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి ఎస్. సమరం కోరారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ప్లీనరీ సమావేశాల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈనెల 29, 30 తేదీలలో గుడివాడలోని సుందరయ్య భవన్‌లో ఈ సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యావిధానంలో మార్పులు తీసుకురావడం, డిగ్రీలో మేజర్, మైనర్ విధానాలు వ్యతిరేకించడం, ఇంటర్న్‌షిప్ భారం తదితర సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించడం తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ ప్లీనరీని జయప్రదం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఎ. జగన్, కార్యదర్శి నరేంద్ర, కమిటీ సభ్యులు పవన్, సుధీర్, సాయి పాల్గొన్నారు.

జిమ్ సెంటర్ ప్రారంభం

ముదినేపల్లి రూరల్: మారుతున్న ఆహారపు అలవాట్లు కారణంగా అనారోగ్యపాలవుతున్న వ్యక్తుల ఆరోగ్యానికి జిమ్‌సెంటర్లు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులో జిమ్‌సెంటర్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు.